# సాగర సంగమం

## ఆర్. ఎస్. సుదర్శనం

ఆయన పేరు చెప్పగానే గుర్తు వచ్చే నవల సంసార వృక్షం. రెండు కథా సంపుటాలు వెలువరించారు. వీరి నవల, దాదాపు పది కథలు హిందీ, గుజరాతీ భాషలలోకి తర్జుమా అయినాయి. 1976లో సంసార వృక్షం నవలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు అందుకున్నారు. సుదర్శనం సమాజమూ – సాహిత్యమూ, సాహిత్య నేపథ్యం లాంటి విమర్శనా గ్రంథాలను ప్రచురించారు. ఉన్నత విద్యా శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. 1985లో పదవీ విరమణ చేశారు. సుదర్శనం కాల్పనిక సాహిత్యంలో ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. తాత్విక ధోరణిలో మార్మిక వాదం ఆర్ఎస్ఎస్ ముద్ర.

పూరీ బీచ్ పది గంటల ఎండలో మెరుస్తున్న ముదురు నీలిమతో, తెల్లని శీర్షాల తరంగాలతో, ఘోషిస్తున్న సముద్రంవైపు చూస్తూ నడిచాము. లక్ష్మీప్రసాద్ నీళ్ళకు దగ్గరగా వెళ్ళి నిల్చున్నాడు. అలవచ్చి అతని పాదాల్ని తాకి వెనక్కి వెళ్ళింది.

"నాకు సముద్రుడు పాదాభివందనం చేశాడు" అన్నాడు లక్ష్మీప్రసాద్.

"చేస్తాడు, చేస్తాడు, ఏమారితే కాళ్ళు పట్టి లాగేస్తాడు తనలోకి" అన్నాడు సంగమేశం.

సంగమేశం దోసిట్లోకి నీళ్ళు తీసుకుని అర్ఘ్యం వదలినట్లు ఆకాశం వైపు చూసి వదిలాడు.

"ఎవరికన్నా తర్పణం విడుస్తున్నావేమిటి?" అన్నాను నేను.

"ఎవరి కోసమో ఎందుకూ? నాకు నేనే!" అన్నాడు సంగమేశం.

బీచ్ కెదురుగా రోడ్డు కవతల వరుసగా సత్రాలు, గెస్ట్ హౌస్‌లూ.

"మన విడిది దాటి దూరం వచ్చేసామల్లే ఉంది. ఎదురుగా ఏదో మందిరం ఉంది. చూసి వెళ్ళిపోదాం పదండి. ఎండెక్కుతోంది." సంగమేశం ప్రతిపాదన ఆమోదించాం.

అది గౌరాంగుని మందిరం.

అక్కడ ఉన్న గోస్వామి కృష్ణచైతన్యుని గూర్చి చెప్పాడు. చైతన్యుడు జగన్నాథుని ఆలయంలోకి వెళ్లి అదృశ్యుడైనాడని అంటారు. కాదు, సముద్రంలోకి నడిచి వెళ్ళిపోయాడు, ఆ చోటుకి ఎదురుగుండానే మందిరం నిర్మాణం అయిందని గోస్వామి మాతో అన్నాడు.

విడిదికి తిరిగి వస్తూ చర్చలో పడ్డాము.

"సముద్రంలోకి నడిచి వెళ్ళినా, మృతదేహం ఒడ్డుకి రావాలి కదా" అంటూ సందేహం వెలిబుచ్చాను నేను.

"వచ్చిందో లేక షార్క్‌లు ఏవైనా నమిలి మింగేశాయో! ప్రతిదాన్నీ ఒక మిస్టరీయో, మిరకిలో చేస్తారు మనవాళ్లు. మోస్ట్ అన్‌సైంటిఫిక్ ఫెలోస్ ప్రపంచం మొత్తం మీదే" అన్నాడు లక్ష్మీప్రసాద్. వృత్తిరీత్యా డాక్టరు. లక్ష్మీకటాక్షం పుష్కలంగా ఉన్నవాడు.

"సైంటిఫిక్ అంటే ఏమిటోయ్? నీకు తెలిసిందే సైన్సా? అయిన్‌స్టీన్ సిద్ధాంతం ఏమి చెబుతోంది?

## ఆణిముత్యాలు

ఒక వస్తువు కాంతివేగాన్ని అందుకోగలిగితే అది అదృశ్యమౌతుందని చెప్పడంలేదూ? శరీరమంటే ఏమిటి? పరిభ్రమించే అణువులూ, వాటిలో మళ్ళీ సూక్ష్మాంశాలైన ఎలెక్ట్రాన్స్ వగైరా పార్టికల్స్. వీటి సమాహారమే మన దృష్టికి ఒక ఆకృతిగా – మేఘం కనిపించదూ, అలాగ–కనిపిస్తోంది తప్ప మరేమిటి? దాని స్థితి మారి కాంతి వేగాన్ని దేహంలోని కణాలు అందుకుంటే, శరీరం కాంతిగా ప్రజ్వలించి అదృశ్యమైపోవడంలో ఆశ్చర్యమేముందీ?" అన్నాడు సంగమేశం.

సంగమేశం జ్ఞాన – విజ్ఞాన పథికుడు. మరో వృత్తీ, వ్యాపకం లేనివాడు, వెనక ఆస్తిపాస్తులు ఉండటమే కాకుండా, అతని భార్య మద్రాసులో

లెక్చరర్ ఉద్యోగం చేస్తోంది. సొంత యిల్లూ, యిద్దరు పిల్లలూ, సంగమేశం అన్వేషణ ఒక మార్గంలో, ఒక శాఖలో కాదు – కవిత్వం, వేదాంతం నుంచీ కళలూ, పురావస్తు శాస్త్రంతో బాటు యోగం, ఆధ్యాత్మికత వరకూ, ఎప్పుడు దేనిమీద మనసుపోతే దాన్ని పట్టుకుని, ఏ తంజావూరు లైబ్రరీలోనో, మధుర దేవాలయంలోనో నెలల పర్యంతరం ఉండిపోగలడు. విశాఖ వచ్చి నన్నూ, లక్ష్మీప్రసాద్‌నూ పూరీ తీసుకు వచ్చినవాడూ సంగమేశమే. మేం ముగ్గురూ బాల్య స్నేహితులం. చిన్నతనంలో కలిసి చదువుకున్నాం.

"సిద్ధాంతం సరేనోయ్, అది అసాధ్యమనేగా శాస్త్రం చెబుతోంది! 'లైట్ బారియర్' అంటే ప్రకృతి ఏర్పరచిన సరిహద్దునే కాంతివేగం అంటున్నప్పుడు, చైతన్యుడు మాత్రం దాన్నెలా అధిగమించాడు? పోనీ, చైతన్యునిలాంటి కేసెస్ యింకా ఏవైనా ఉన్నాయా?" అని లక్ష్మీప్రసాద్ ఆక్షేపణ.

"అబ్బాయ్, నేను మెటీరియలిస్ట్‌గానే మాట్లాడుతున్నాను. మనిషి శరీరం ఒక యంత్రం. అంటే ఒక జనరేటర్. దాన్నుంచే మెకానికల్, కెమికల్ ఎనర్జీలు మనం నిత్యం ఉపయోగిస్తున్నాము. ఎలెక్ట్రికల్ ఎనర్జీ పుడుతోందని దాఖలాలున్నాయి. కాంతి కూడ పుట్టడం సాధ్యం. కొందరు విశిష్ట వ్యక్తులు గతంలో కాంతిమయ శరీరాలను పొంది, శరీరం మట్టిలో కలిశాక తేజశ్శరీరాలతో చిరకాలం ఉండినారనే తెలుస్తోంది. పోతే, వాటికీ టైమ్ లిమిట్ ఉందనే అనిపిస్తుంది. అందువల్ల చైతన్యుడు తన శరీరాన్ని మూర్తిగా తేజశ్శరీరంగా ప్రజ్వలింపజేసి అదృశ్యుడైనాడంటే అది అన్‌సైంటిఫిక్ కానే కాదు?" అని సంగమేశం వాదం.

"పురాణాలకూ సైన్స్‌కూ విభజన రేఖ లేకుండా తుడిచేసి అయోమయంలో అంధకారంలో జనాన్ని తోసే ప్రయత్నం మాత్రం చెయ్యకు బాబూ" అన్నాడు లక్ష్మీప్రసాద్.

ఇవాళ సైన్స్ ఫిక్షన్, రేపటి సైన్స్ ఎచీవ్‌మెంట్? మన ఊహకూ భావనకూ దూకుడూ, సాహసం ఉండాలి. నువ్వేమంటావ్ బ్రదర్?" అని నా అభిప్రాయం కోరాడు సంగమేశం.

"బాగానే ఉంది. కాని చావడం ఎలా చస్తేనేం? బ్రతకటానికి మార్గాలు చూపితే ఉపయోగం కాని, చచ్చేవాడు మట్టిలో కలిసినా, వెలుగులో కలిసినా మానవజాతికి ఉపయోగం లేదు అంటాను. ఎందుకు దాన్ని గూర్చి అన్వేషణ?" అన్నాను.

"అలా కాదోయ్? మనస్సూ శరీరం కలిసే ఉంటున్నాయి. జీవితానికి పర్యవసానమే మరణం. చైతన్యుని జీవితంలో ప్రధానమైన భక్తి పారవశ్యం – ఆయన యితరుల్ని తాకితేచాలు, వాళ్ళకీ ఆ పారవశ్యం వచ్చేదట – అది చేరుకున్న పరాకాష్ఠ అతని శరీరాన్ని వెలుగుగా మార్చితే, అదే ఆయన నిష్క్రమణంగా ఈ లోకం వాళ్లకి కనిపించిందన్నమాట. సముద్రంలోకి నడిచాడంటే, ఆ ఎలెక్ట్రికల్ ఎనర్జీని మరి సముద్రం ఒక్కటేకదా భరించగలదు? సముద్రంలోకి వెళ్లడమే నిజమని తోస్తుంది నాకు" అన్నాడు సంగమేశం.

లక్ష్మీప్రసాద్ కందుకూరులో పెద్ద నర్సింగ్ హోమ్ కట్టాడు. విశాఖలో మెడికల్ కాన్ఫరెన్స్ జరుగుతూంటే దానికోసం వచ్చాడు. అతని రాకకు నాలుగు రోజులు పూర్వమే సంగమేశం మద్రాసు నుంచీ వచ్చాడు. నేను విశాఖలో రీడర్‌గా ఉంటున్నాను. చాలా రోజులకు ముగ్గురం అనుకోకుండా కలియడం వల్ల పూరీ యాత్ర సాగించాము.

పూరీలో ఆ రెండు రోజులూ ఒకరి విషయాలొకరు క్షుణ్ణంగా చర్చించుకున్నాము. లక్ష్మీప్రసాద్‌కు యిద్దరు కూతుళ్లు. కొడుకులు లేరని అసంతృప్తి. పెద్దకూతురు డాక్టరు చదివింది. ఆమెను డాక్టరుకిచ్చే చేశాడు. రెండో అమ్మాయిని ఒక ఐ.ఏ.యస్. కుర్రాడికిచ్చి చెయ్యబోతున్నాడు శ్రావణమాసంలో. మనుమ సంతానం కోసం ఉవ్విళ్ళూరుతున్నాడు. విదేశాలు పర్యటించిరావాలనీ ఉంది. ఇంకా ఏవో గుర్తింపులూ, గౌరవ పదవులూ, బహుశా రాజకీయాలూ అతని జీవిత లక్ష్యంగా ఉన్నట్లు చూచాయగా గ్రహించాము నేనూ, సంగమేశమూ.

ఎందుకు చెబుతున్నానంటే ఆ ఏడు శ్రావణమాసమూ వచ్చింది, లక్ష్మీప్రసాద్ రెండో కూతురు వివాహమూ జరిగింది. వివాహానికి నేను వెళ్లాను. సంగమేశం వచ్చాడు. మేము పెళ్లి నుంచీ తిరిగి వచ్చిన వారం రోజులకే పిడుగులాంటి వార్త లక్ష్మీప్రసాద్ పోయాడని!

జరిగిందేమిటి? మనుగుడుపులకు వచ్చిన కొత్త వధూవరులతో, పెద్దకూతురూ అల్లుడూ, తన భార్యా, నర్సింగ్ హోమ్‌లో యిద్దరు డాక్టర్ల కుటుంబాలతో రామాయపట్నం పిక్నిక్ ఏర్పాటు చేశాడు లక్ష్మీప్రసాద్. రెండు కార్లలో తెల్లవారు జామునే కూతుళ్లూ, అల్లుళ్లూ, డాక్టర్ కొలీగ్స్, వాళ్ల పిల్లల్తో లక్ష్మీప్రసాద్

రామాయపట్నం వెళ్ళిపోయాడు సముద్ర స్నానం చేసే ఉద్దేశంతో. డాక్టర్ల భార్యలూ, లక్ష్మీప్రసాద్ భార్యా వంటలూ వార్పులూ చేయించుకుని తొమ్మిదింటికి యితర బలగంతో వాన్‌లో వచ్చే ఏర్పాటు చేశాడు. రామాయపట్నం బీచ్‌లో సముద్ర స్నానం ముగించి లక్ష్మీప్రసాద్ తాను ఒడ్డున నిల్చున్నాడు. కూతుళ్లూ డాక్టర్ల పిల్లలూ గెస్ట్‌హౌస్‌కి వెళ్లారు. అల్లుళ్లిద్దరూ, ఒక డాక్టరూ, యింకా సముద్రంలో మునకలేస్తూనే ఉన్నారు. ఇంతలో పెద్ద పర్వతంలాంటి అల రాక్షసునిలా వచ్చి ఆ ముగ్గుర్నీ కబళించింది. చూస్తూ నిల్చున్న లక్ష్మీప్రసాద్ క్రింద పడిపోయాడు. తీరాన్ని తాకిన అల అతని శరీరాన్ని లోపలికి తీసుకువెళ్లింది. అలచేత కబళింపబడిన ముగ్గురిలో డాక్టరూ, రెండవ అల్లుడూ చాకచక్యంగా తప్పించుకుని, స్పృహ తప్పిన పెద్ద అల్లుణ్ణి ఒడ్డుకు చేర్చారు. అల్లంత దూరంలో ఉండిన డాక్టరు కొలీగ్ అతనికి ప్రథమ చికిత్స చేశాడు. వాళ్లకి లక్ష్మీప్రసాద్ కనిపించలేదు. కొంతసేపటికి మరో అల లక్ష్మీప్రసాద్ మృతదేహాన్ని ఒడ్డుకి చేర్చింది. లక్ష్మీప్రసాద్ ఊపిరితిత్తుల్లో నీళ్లు లేవు. అల్లుళ్లు సముద్రంలో అదృశ్యం అవడం చూచిన అతనికి షాక్ వల్ల హఠాత్తుగా గుండె ఆగిపోయి వెంటనే మరణించాడని తేలింది పరీక్షలో. వాన్ కందుకూరి నుంచీ బయల్దేరకుండానే శవం యిల్లు చేరింది.

లక్ష్మీప్రసాద్ అంత్యక్రియలూ అవశిష్టాలూ అయ్యాక నేనూ, సంగమేశం సింగరాయకొండ స్టేషన్‌లో, అతను మద్రాస్‌కి - నేను విశాఖకీ రైళ్ల కోసం చూస్తూ కూర్చున్నాము. సంగమేశం అన్నాడు "ఎలా చస్తేనేం, ఎలా బ్రతకటం అనేది కదా ముఖ్యం అన్నావు నువ్వు పూరీలో గుర్తుందా? సావధానంగా మాట్లాడుకున్నాము... ఎలా చచ్చాడనేది బ్రతుక్కి ఒక వ్యాఖ్యానంలా ఉంటుందోయ్. అహింసను జపించిన గాంధీగారు ఎలా మరణించారు? హింసాకృత్యం కారణంగా! ఆశలతో, మమకారాలతో బ్రతికిన లక్ష్మీప్రసాద్‌కి వాటితో ఎంతటి తాదాత్మ్యమో అతని మరణం తీరు నిరూపిస్తోంది. ఒక విధంగా అతడు అదృష్టవంతుడు. అల్లుళ్లుపోయి తను మిగిలి ఉంటే అతని బ్రతుకెంత దుఃఖభాజనంగా ఉండేదో!"

"అయితే మనం జీవితంలో దేన్ని ఎక్కువగా ప్రేమిస్తామో దాని ప్రతిద్వంద్వమే మరణమా?"

"అంతేగా మరి! జీవితానికి ప్రతిద్వంద్వం మరణం కాక మరేమిటి?"

## నవ్వు

పువ్వులు నవ్వుతాయి-
మకరంద రసోజ్జ్వలనంగా
సృజనాత్మక కళారంజకంగా
భావావేశ నిసర్గ బంధురంగా...!
పసిపాపలు నవ్వుతారు-
చిద్విలాస రసపూర్ణంగా
తేనెలొలుకు నవ కావ్యంగా
పసిడిపూత తొలి కిరణంగా!!

## రూపాంతరం

శిల
శిల్పి చేతిలో పడితే
శిల్పమై అలరిస్తుంది
చినుకు
స్వాతి చిప్పలో పడితే
ముత్యమై భాసిస్తుంది
మనసు
మమకారంతో నిండితే
మానవత్వం దీపిస్తుంది

## పేదోళ్ళు

ఎండలో ఎండిపోయి
గాలికి ఎగిరిపోయిన
గడ్డి పరకలు-
వానకు తడిసియి
క్రమంగా కరిగిపోయిన
మట్టిబెడ్డలు
పేదోళ్ళు

## అన్యాయం

మట్టిని పిసికి
మాణిక్యాలు పండించిన వానికి
పొట్ట నింపుకోవడానికి
పట్టెడు మెతుకులు కరువు!
మేడలలో వెన్నెల వాడలలో
మేలిమి నీడలలో
పవ్వళించిన వానికి
పొట్ట నిండా సిరులు!!

-సి. కామేశ్వరరావు

"జీవితం పట్ల వైరాగ్యం పెంచుకున్నవాడో?"

"వాడు మరణం మీదా జీవితం మీదా విజయం సాధించినట్లే."

"అంటే వాడు మరణించడా?"

"శరీరం ఉంటుందా, పోతుందా అని కాదు ప్రశ్న. అతని మనస్థితి ద్వంద్వాతీత మనస్థితి. మామూలు మట్టి శరీరం కాదని, పోనీ తేజశ్శరీర మొకటి నిర్మించుకోగలడా? అదెంతకాలం ఉంటుందీ? వీటికి సమాధానం వాడి తపస్సు లక్ష్యాన్నిబట్టీ, సిద్ధినిబట్టీ ఉంటుంది! మామూలు మనిషి విషయంలో కూడా తేజశ్శరీరం వంటి ప్రేతం 15 రోజులు ఉంటుందని 'టిబెటన్ బుక్ ఆఫ్ ది రెడ్' వగైరా గ్రంథాల నుంచీ, పెద్దకర్మ చేసే మన ఆచారాన్ని బట్టీ తెలుస్తోంది. కొందరు మహాత్ములు లోకోపకారార్థం తేజశ్శరీరంతో కొనసాగుతూనే ఉంటారుట..."

నేనెక్కవలసిన రైలు రావడంతో ఆ చర్చ అక్కడకి ముగిసింది.

ఒక ఏడాది గడిచింది. నేను జబ్బుపడ్డాను. 'డింగీ' జ్వరం అన్నారు. కోలుకొంటూ చాల నీరసంగా ఉన్నాను. ఆనాడు శ్రావణపూర్ణిమ. కలలో సంగమేశం కనిపించాడు. నన్ను పక్కమీద నుంచీ లేచిరమ్మని పిలుస్తున్నాడు. నవ్వుతూ సరదాగా ఉన్నాడు. నీరసంతో, ఎంత ప్రయత్నించినా నేను లేవలేకపోతున్నాను. "నువ్వు లేవాలనుకుంటే లేవొచ్చునోయ్!" అంటూ చెయ్యి చాపాడు. నాకు అందటం లేదు. చివరకు అందింది అనుకున్నానో లేదో మెలకువ వచ్చేసింది. చేతి వ్రేళ్ళతో గోడను తడుముతున్నట్లు తెలుసుకున్నాను.

తర్వాత మూడు రోజులకి నాకు ఉత్తరం వచ్చింది.

బ్రదర్,

నేను తిరిగిన గుడుగుడు గుంచంలో అయిన్‌స్టీన్ సిద్ధాంతం గూర్చీ, తేజశ్శరీరం గూర్చీ నీతో చెప్పిందంతా మరిచిపో! అంతా వట్టిది! ఆనందం తప్ప అంతా వట్టిదే! ఆనందం సముద్రం, సముద్రానందం! చైతన్య సముద్రం నుంచీ వేరుపడి బీచ్‌మీద గవ్వలేరుకునే పిచ్చివాళ్ళం మనం! అర్థాలూ అనర్థాలూ లేవు. మనస్సు – శరీరం, మట్టి శరీరం – తేజశ్శరీరం అని వేర్వేరుగా లేవు. మతాలూ, సంప్రదాయం, జ్ఞానం, విజ్ఞానం అంతా హుళక్కి. ఇవన్నీ నాకూ సముద్రానికీ మధ్య తెరలు, అవరోధాలు మాత్రమే. ప్రొద్దున లేవడం, నిత్యకృత్యాలు తీర్చడం, రాత్రి నిద్రించడం – ఏమిటీ బోర్? దీనికి అర్థం ఉందా? ఇలా సముద్రాన్ని పుడిసిళ్ళతో కొలవడం సాధ్యమా? సముద్రం నా ప్రేయసి. సముద్రం నా సర్వస్వం. సముద్రం నా చైతన్యం, సముద్రం నేను. మమ్మల్నిక ఏ మాయా వేరు చెయ్యదు. సముద్రం ఆనందం – నేను – ఆనందం – నేను – సముద్రం – నేను – ఆనందం – నేను – సముద్రం...

–సాగరసంగమేశ్వరశాస్త్రి

ఉత్తరం నాకు బోధపడలేదు. సంగమేశం అన్వేషణలో చివరకు మిస్టిసిజమ్ వికటించి పిచ్చికి దారితీస్తోందనిపించింది. తర్వాత తెలిసింది వార్త – సంగమేశం శరీరాన్ని సముద్రం ఎడ్వర్డ్ ఎలియట్స్ బీచ్‌లో ఒడ్డుకి చేర్చిందని! అది స్వచ్ఛంద మరణమో, ఆత్మహత్యో తేల్చుకోలేకపోయాను. ఇంత జరిగాక, ఇద్దరు మిత్రుల్ని కోల్పోయాక కూడ జీవన్మరణాల తాత్త్విక రహస్యం, రహస్యంగానే ఉండిపోయింది నాకు. అప్పటికి ఉన్న నా కాస్త అవగాహనా పూర్తిగా చెదరిపోయింది. మూగవాడిలా, ఊహలు కూడా మూగవోయి, విశాఖ బీచ్‌లో నుంచుంటాను సముద్రాన్ని చూస్తూ సాయంత్రాలు.

*('భారతి' మాసపత్రిక : 1984)*

---

## ఎన్ని'కల'లు!

ఎన్నికల ముందు
దేశ నేతలు వేసిన
కలల నిచ్చెన ఎక్కుతూ
ఊహాలోకాల్లో విహరిస్తూ
అశేష అమాయక 'ప్రజ'లు...
ఎన్నికల తర్వాత
వాస్తవ లోకంలో
జర్రున జారిపోతూంటే
ప్రశ్నలే మిగిలేవి...
జవాబులేవి?...
వర్తమాన జీవితంలో
మనిషి బ్రతుకు జారుడు బల్ల...
అస్తవ్యస్త రాజకీయ వ్యవస్థలో
దీన జనోద్ధారణ కేవలం కల్ల.

–గుండాన జోగారావు